# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 16, (ప్రజాజ్యోతి)** జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ,

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 17 | జూన్ | 2026 ◆ పేజీలు : 7



# వారికింత... వీరికింత....

7 లో..

# మాకుండేదేంతా...?

- పేటలో పెట్రేగిపోతున్న మట్టి మాఫియా
- అధికారుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు అందరికి అమ్యామ్యలేనా...?
- పేద, మధ్యతరగతి ప్రజల పై పెనుభారం పడుతుందా..?
- ఉదాసినాతే పుట్టిముంచునుందా..?
- అదుపుచేయకపోతే... అనర్ధమేనా...?

"వారికింత... వీరికింత.... మాకుండేదేంతా...?" అంటూ అశ్వారావుపేట నియోజకవర్గంలో మట్టి మాఫియా బరితెగించి వ్యవహరిస్తోంది. నిబంధనలను తుంగలో తొక్కి, సహజ వనరులను నిలువునా దోచేస్తూ, అందరికీ వాటాలు పంచుతూ తమ అక్రమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తోంది. నిలదీయాల్సిన అధికారులు, ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులు సైతం ఈ 'మామూళ్ల' మత్తులో జోగుతుండటంతో నియోజకవర్గంలో మట్టి మాఫియా ఆగడాలు పరాకాష్టకు చేరాయని విస్తృత ప్రచారం జరుగుతుంది.

● అశ్వారావుపేట, ప్రజాజ్యోతి

# కిక్ కొడితే పతకమే..!

- కరాటేలో సత్తా చాటుతున్న భద్రాచలం బాలుడు
- అంతర్జాతీయ పోటీలే తదుపరి లక్ష్యం



వయసు కేవలం 13 ఏళ్లు... చేతిలో పుస్తకం, మనసులో లక్ష్యం, అడుగడుగునా క్రమశిక్షణ. సాధారణ కుటుంబంలో జన్మించిన ఓ బాలుడు తన పట్టుదల, నిరంతర సాధనతో కరాటే రంగంలో విజయాల బాటలో దూసుకెళ్తున్నాడు. ప్రతి కిక్‌లో ఆత్మవిశ్వాసాన్ని, ప్రతి పోటీలో విజయసంకల్పాన్ని నింపుకుంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న భద్రాచలం పట్టణానికి చెందిన పిట్టల సిద్ధార్థ్ ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై భారత జెండాను రెపరెపలాడించాలనే మహత్తర లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. కరాటేలో ప్రతి కిక్ వెనుక కఠోర సాధన, ప్రతి పతకం వెనుక అచంచలమైన పట్టుదల ఉంటుందని నిరూపిస్తున్న ఈ బాల క్రీడాకారుడి ప్రస్థానంపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.

5 లో...

# నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**ఆళ్ళపల్లి. జూన్16 (ప్రజాజ్యోతి)** ఆళ్ళపల్లి మండలం లో జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, విద్యా ప్రమాణాలు. పోషకాహార సరఫరాపై క్షేత్రస్థాయిలో విస్తృత సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడం, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. పెద్ద వెంకటాపురం గిరిజన ప్రాంతంలో బడి ఈడు పిల్లలందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభించే నాణ్యమైన విద్య, వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటిస్తూ, గర్భిణులు, బాలింతలు. పిల్లలకు ఇచ్చే పోషకాహార సేవలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్ ఉషా రాణి, ఎంఈఓ శాంతారావు, సర్పంచ్ వజ్జ ఉమా పాల్గొన్నారు.

# అభివృద్ధే అజెండా.. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే జారె

- దమ్మపేట మండలంలో రూ.1.20 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



**దమ్మపేట, జూన్. 16 (ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. దమ్మపేట మండలంలో రూ.1,20,80,000 వ్యయంతో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. విద్య, రవాణా,

మిగతా 2 లో...

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)

అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ, భూ సేకరణ శాఖల అధికారులతో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్, సీతమ్మ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు, పులుసుబొంత ప్రాజెక్టు, సింగభూపాలెం ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ, పెండింగ్ అనుమతులు, సమస్యలపై పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా భూ సేకరణ పురోగతి, భూ సర్వే పనులు, వివిధ ప్యాకేజీల వారీగా పెండింగ్‌లో ఉన్న అంశాలు, కోర్టు కేసులు, అనుమతుల స్థితిగతులను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన ప్రాజెక్టుల భూ సేకరణ పురోగతిపై సమగ్రంగా చర్చించి, పనులు వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణకు సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సూచించారు. భూ సర్వే పనులను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైతే అదనపు సర్వేయర్లను కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే భూసేకరణకు సంబంధించిన పెండింగ్ కోర్టు కేసులు, వివిధ అనుమతుల అంశాలను ప్రత్యేక దృష్టితో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ, ఇరిగేషన్, భూ సేకరణ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టుల అమలుకు అవసరమైన భూమి సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల పురోగతి జిల్లాలో అభివృద్ధికి కీలకమని, అందుకే ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించి లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశం లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, డి ఆర్ ఓ పద్మావతి, ఆర్ డి ఓ మధు, సంబంధిత మండలాల తాసిల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, భూ సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీటి సమస్యకు కార్పొరేటర్ సత్వర పరిష్కారం

- **సొంత నిధులతో పైపులు ఏర్పాటు చేసి మరమ్మతులు**



**సుజాత నగర్, జూన్ 16 (ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ సుజాత నగర్ పరిధిలో గల 21వ డివిజన్ పరిధిలోని గొల్లగూడెం గ్రామం నుంచి రాఘవపురం వెళ్లే మార్గంలో మురుగునీరు నిల్వ ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి సాయికుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే స్పందించారు. కార్పొరేషన్‌లో నిధుల కొరత ఉన్నప్పటికీ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తన సొంత నిధులతో సిమెంట్ పైపులు ఏర్పాటు చేసి మరమ్మతు పనులు చేపట్టించారు. దీంతో మురుగునీరు నిల్వ ఉండే సమస్యకు తాత్కాలికంగా పరిష్కారం లభించింది. ప్రజా సమస్యల పరిష్కారంలో కార్పొరేటర్ చూపిన చొరవను గ్రామస్తులు అభినందించారు. వర్షాకాలానికి ముందే సమస్యను గుర్తించి చర్యలు తీసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ శ్రావణి సాయికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# మెచ్చా జన్మదినం.. కార్యకర్తల సంబరం

- **మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు**



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 16 (ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు జన్మదినం సందర్భంగా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ నాయకత్వం అవసరమని, అశ్వారావుపేట అభివృద్ధికి మళ్లీ మెచ్చా నాగేశ్వరరావు నాయకత్వం రావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు, భారత రాంబాబు, కొత్తూరు వెంకటేశ్వరరావు, చల్లా రాంబాబు, పుల్లారావు, గోపినాథ్, పుచ్చకాయ నర్సారెడ్డి, చెన్నారెడ్డి, పర్సా మాధవరం, వాడపల్లి వెంకటేశ్వర్లు, కొండేటి నరసింహారావు, చల్లా సుమన్, పింకీ చంటి, కార్తీక్, మోడియం శ్రీను, లకవాత్ కృష్ణ, సత్యనారాయణ, బత్తుల వెంకటేశ్వరరావు, చల్లా బిక్షం, చల్లా నాగరాజు, మాదాల జమాలయ్య, గుడిమెట్ల శ్రీకాంత్, రహిమత్, పానుగంటి రాఘవులు, చల్లా ప్రసాద్, రషీద్ ఖాన్, సడెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రాజారావుకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు



**ములకలపల్లి, జూన్ 16,(ప్రజాజ్యోతి):** మండలంలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన దిశ రిపోర్టర్ ఇనుకుర్తి రామాచారి తండ్రి రాజారావు మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లిన బూర్గంపహాడ్–అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ తొలి రాష్ట్ర ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముదిగొండ శ్రీను, పోతుగంటి లక్ష్మణ్, బండి కొమరయ్య, సుభాని, రాంబాబు, రఫీ, చారి, తోట కొండా, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొని రాజారావుకు నివాళులర్పించారు

## వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని కల్వర్టు మరమ్మతులు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ అంకిత్



**ఆళ్ళపల్లి, జూన్ 16 (ప్రజాజ్యోతి)** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కుంగిపోయిన కల్వర్టుకు తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆళ్ళపల్లి మండల పర్యటనలో భాగంగా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి కుంగిపోయిన కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రయాణికులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యవసర మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు.అదేవిధంగా సాంకేతిక నిపుణులతో కల్వర్టును పరిశీలింపజేసి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి, రవాణాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు.ప్రజల సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇస్తూ, రాకపోకలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో మధు, ఉషారాణితో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధే అజెండా.. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే జారె





(మొదటి పేజీ తరువాయి...)

చిన్నారుల సంక్షేమం, గ్రామీణ మౌలిక సదుపాయాల మెరుగుదలకు చేపట్టిన ఈ పనులు ప్రజల జీవన ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని తెలిపారు. అంకంపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని కొడిసెలగూడెంలో టిడబ్ల్యూయూపీఎస్ పాఠశాలకు నిర్మించిన ప్రహరీ గోడను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పట్వారిగూడెం గ్రామం లో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన ఎనిమిది సీసీ రోడ్లను ప్రజలకు అంకితం చేశారు.బాలరాజుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని దిబ్బగూడెం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన ఎంపీపీఎస్ పాఠశాల ప్రహరీ గోడను ప్రారంభించారు. మొండివర్రె గ్రామంలో రూ.11.80 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. నాగుపల్లి గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన ఆధునిక అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, చిన్నారుల ఆరోగ్యం, విద్య, పోషకాహారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చిన్నారులకు మెరుగైన వాతావరణంలో విద్య అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరిస్తున్నామని పేర్కొన్నారు. తొట్టిపంపు గ్రామంలో ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను, లింగాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొర్రెగుట్ట గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.20 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. అలాగే మారప్పగూడెం గ్రామపంచాయతీ కొత్తూరులో రూ.8 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని, పాత చీపురుగూడెం ఎంపీపీఎస్ పాఠశాలలో రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలపడితేనే పల్లె పిల్లల భవిష్యత్తు బంగారుమయం అవుతుందని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా నాణ్యమైన విద్యను పొందేలా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి విశేష ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, భద్రతా ప్రమాణాల పెంపు, విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం సృష్టించడం ద్వారా ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం రోడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, తాగునీటి సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని, గ్రామీణ ప్రాంత పిల్లలు పట్టణ విద్యార్థులతో సమానంగా పోటీపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


# మీకోసం మేమున్నాం ప్రతిభా పురస్కారం

- రాష్ట్ర స్థాయి ర్యాంకర్‌కు ఘన సన్మానం



**చర్ల, జూన్ 16 (ప్రజాజ్యోతి):** చర్ల మండలానికి చెందిన గురుదేవ్ విద్యాలయం విద్యార్థిని బి.వి. మాధురి తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్ష (టీజీఆర్‌జేసీ సెట్)లో రాష్ట్రస్థాయిలో 18వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటడంతో ఆమెను మీకోసం మేమున్నాం బృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.మంగళవారం సాయంత్రం చర్ల మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల ఎంపీడీఓ కనపర్తి ఈదయ్య, మండల ఎంపీఓ మూర్తి విద్యార్థినికి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం రూ.10 వేల నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ బహుమతికి లయన్ నీలి ప్రకాష్ రూ.2,000, చింతలపాటి అశోక్ రూ.5,000, బి.వి. ప్రతాప్ రూ.3,000 చొప్పున సహకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈదయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని అన్నారు. మాధురి భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిణిగా ఎదిగి చర్ల మండలానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. చర్ల మండలంలోని వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొని విద్యార్థినిని అభినందించి, ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గురుదేవ్ విద్యాలయం ప్రధానోపాధ్యాయులు హెచ్‌వీవీ గిరి ప్రసాద్, బి.వి. ప్రతాప్, చింతలపాటి అశోక్, శిరిపురపు శివ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో తొలకరి స్నానోత్సవం





**చర్ల, జూన్ 16:(ప్రజాజ్యోతి):** చర్ల పోలీస్ స్టేషన్ సమీపంలో తరతరాలుగా వెలసి భక్తుల పూజలు, నైవేద్యాలు అందుకుంటున్న గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ఘనంగా తొలకరి స్నాన మహోత్సవం నిర్వహించారు.వర్షాకాల ఆరంభాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని కోరుతూ అమ్మవారికి తొలకరి స్నానం చేయించారు.అలాగే గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని, చిన్నారులు విద్యా, విజ్ఞాన రంగాల్లో అభివృద్ధి చెందాలని యువత మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆలయ కమిటీ వారు అన్నారు .ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు , తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## అమ్మ మాట.. అంగన్వాడీ బడిబాట



**చర్ల, జూన్ 16:(ప్రజాజ్యోతి):** చర్ల మండలంలోని ఎర్రంపాడు, తిప్పాపురం అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా "అమ్మ మాట – అంగన్వాడీ బడిబాట" అనే నినాదంతో గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు.ఈ ర్యాలీ ద్వారా చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించి వారికి అందుబాటులో ఉన్న విద్యా, పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు తెలియచేసారు . అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నందున ప్రతి చిన్నారిని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని నిర్వాహకులు కోరారు.గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించిన ఈ ర్యాలీలో గ్రామస్తులు, చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, సూపర్వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన మొదటి రోజు టెట్ పరీక్షలు

- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 16 ,(ప్రజా జ్యోతి)** జిల్లాలో మంగళవారం నిర్వహించిన టీజీ టెట్ జూన్–2026 మొదటి రోజు పరీక్షలు విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం ముందస్తుగా చేపట్టిన ఏర్పాట్లతో పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా జరిగాయని తెలిపారు , జిల్లాలోని అను బోస్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రంలో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారన్నారు, మొదటి సెషన్ (ఎఫ్/ఎన్ మొత్తం 145 మంది అభ్యర్థులు కేటాయించగా, 127 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 18 మంది గైర్హాజరయ్యారనీ, పరీక్ష నిర్ణీత సమయానికి ప్రారంభమై ప్రశాంతంగా జరిగాయి అన్నారు, రెండవ సెషన్ (ఏ/ఎన్ కూడా 145 మంది అభ్యర్థులు కేటాయించగా, 123 మంది అభ్యర్థులు హాజరు కాగా 22 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారనీ, ఈ సెషన్ కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరిగాయన్నారు, జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి అని తెలిపారు.

## బెల్‌ట్ షాపులు బంద్ చేయాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం నిర్ణయం

**భద్రాచలం టౌన్ , జూన్ 16 , ప్రజాజ్యోతి,** పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో మద్యం బెల్‌ట్‌షాపులను సామూహికంగా బంద్ చేయాలని భద్రాచలంలో మంగళవారం జరిగిన గ్రామ పంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. భద్రాచలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కొందరు వార్డు సభ్యులు బెల్టుషాపుల బంద్‌పై చర్చకు పట్టుబట్టారు. ఈ సమయంలో తీర్మానంను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ప్రస్తావించగా సభ్యుల అభిప్రాయాలను సర్పంచ్ తెలుసుకున్నారు. ఈ సమయంలో పాలకవర్గ సభ్యులందరూ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో బెల్టుషాపుల బంద్‌కు అనుకూలంగా మాట్లాడారు. దీంతో భద్రాచలంలో ఇకపై బెల్టుషాపులు ఉండకూడదని తీర్మానం చేశారు. అలాగే నివాసాల మధ్య కాలి స్థలాలలో ఇష్టానుసారంగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించకుండా పట్టించుకోని భూ యజమానులకు తొలిత సమాచారం అనంతరం నోటీస్ జారీ చేసే విధంగా తీర్మానం చేసుకున్నట్లు తెలుస్తుంది. రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రధాన డ్రైనేజీలను జెసిబిలతో పూడికలు తీయించడంతోపాటు ఇంటి పన్ను తదితర కీలక అంశాలపై పాలకవర్గం పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ పూనెం కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్తో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## జన్మనిచ్చిన తల్లి, జన్మించిన శిశువు మృతి

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- వైద్యుల నిర్లక్ష్యమే అంటున్న కుటుంబ సభ్యులు





**గుండాల. జూన్ 16. ప్రజా జ్యోతి** పురిటి నొప్పులతో నిండు గర్భిణి బాధపడు తూ గుండాల ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నప్పటికీ జన్మనిచ్చిన తల్లి, జన్మించిన శిశువు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గుండాల మండలం శంభుని గూడెం గ్రామానికి చెందిన చాట్ల వనజ (21) పురిటి నొప్పులతో బాధపడుతూ గుండాల ప్రాథమిక ఆరోగ్య uకేంద్రానికి తీసుకురాగా శనివారం రాత్రి తీసుకువచ్చారు. కుండాల ప్రభుత్వ దవాఖానలో తల్లి శిశువుకు జన్మనిచ్చినప్పటికీ శిశువు మృతి చెందగా తల్లి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. గుండాల దవాఖానలో డాక్టర్లు లేరని ఒకే ఒక నర్సు గర్భిణీకి చికిత్స చేసి, డెలివరీ చేయగా ప్రసవించిన ఆడ శిశువు స్పర్శ లేకపోవడంతో ఆక్సిజన్ పెట్టి ఇల్లందు తరలించారు ఇల్లెందు ప్రభుత్వ హాస్పిటల్లో శిశువును పరీక్షించిన వైద్యులు శిశువు మరణించిందని నిర్ధారించారు. తల్లి వనజ తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో ఖమ్మం ప్రభుత్వ హాస్పటల్కు తరలించారు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. భర్త సంజీవరావు ఇరువురి దాన సం స్కారాలు నిర్వహించిన అనంతరం తన బాధను గ్రామస్తులతో గ్రామ సర్పంచ్ తో చెప్పుకోగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు వివరాలు తెలుసుకొని డాక్టర్ లేని కారణంగానే తిరువూరు మృతి చెందారని ఆరోపించారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే భార్య కూతురు చనిపోయారని విలపించాడు. ఇలాంటి ఘటనలు జరగకుండా జిల్లా అధికారులు చూడాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా వైద్య అధికారులతో పాటు ఇతర జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు

## సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం





**చర్ల, జూన్ 16 (ప్రజాజ్యోతి):** ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా చర్ల మండలంలోని రైస్‌పేట కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్యారంభం చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉచితంగా పలకలు, నోట్‌బుక్స్, స్వీట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలలో ప్రీ–ప్రైమరీ విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మూడు, నాలుగు సంవత్సరాలు నిండిన చిన్నారులను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పలకలు, నోట్‌బుక్స్, యూనిఫాంలతో పాటు పుష్టికరమైన ఆహారాన్ని కూడా అందిస్తున్నదని ఆయన వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ లలిత, ఉపాధ్యాయులు డి. ధనలక్ష్మి , కె. స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ప్రారంభించనున్న జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 16,(ప్రజా జ్యోతి)** రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను ముందస్తుగా బుక్ చేసుకునే సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ను జిల్లా కలెక్టర్ అంకిత్ నేడు ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ యాప్ ద్వారా రైతులు తమ మొబైల్ ఫోన్‌లోనే యూరియా అవసరాన్ని నమోదు చేసి ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని, బుకింగ్ అనంతరం జారీ అయ్యే బుకింగ్ ఐడీ ఆధారంగా సమీప ఎరువుల విక్రయ కేంద్రంలో యూరియాను పొందవచ్చని తెలిపారు, ఎరువుల పంపిణీలో పారదర్శకత పెంపొందించడంతో పాటు రైతులకు సకాలంలో యూరియా అందించడమే ఈ యాప్ ప్రధాన ఉద్దేశ్యమని , జిల్లాలోని రైతులందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు కోరారు.

# గంజాయి పట్టివేత

- నిందితులు అరెస్టు... రిమాండ్



**బూర్గంపహాడ్, జూన్ 16 (ప్రజా జ్యోతి):** ద్విచక్రవాహనంపై అక్రమంగా గంజాయి తరలిస్తూ బూర్గంపహాడ్ పోలీసులకు ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. దీనికి సంబంధించి ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం...ఒడిస్సా నుంచి ములుగు జిల్లా మంగపేటకు బజాజ్ పల్సర్ వాహనంపై అక్రమంగా 2.1 కిలోల గంజాయి తరలిస్తుండగా ములుగుజిల్లా మంగపేటకు చెందిన బడే భరత్, ఉప్పరపల్లి వెంకటేష్లను మండల పరిధిలోని సారపాక పల్లెప్రకృతివనం వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.5లక్షలు ఉంటుందని తెలిపారు. గంజాయితో పాటు ద్విచక్రవాహనం, రెండు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకుని పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

# బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి జన్మదిన వేడుకలు



**భద్రాచలం టౌన్ , జూన్ 16 , ప్రజాజ్యోతి** భద్రాచలం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి శివనాయక్ జన్మదిన వేడుకలు మంగళవారం భద్రాచలం కోర్టు ఆవరణలో వేద పండితుల ఆశీర్వచనంతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగాకోర్టు ఆవరణలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిగా శివనాయక్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాభవాని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసా చారి, జాయింట్ సెక్రెటరీ తాతా లలిత, కోశాధికారి దన్నాన రాము, లేడీ రిప్రజెంటేటివ్ ఎం తరుణి, సీనియర్ న్యాయవాదులు ఎంవి రమణారావు, గోడపర్తి నాగరాజు, రావి రామ్మోహన్, ఆర్. జయరాజ్ పాల్గొన్నారు.

# న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులివ్వాలి

- ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ భద్రాచలం యూనిట్ డిమాండ్

**భద్రాచలం టౌన్ , జూన్ 16 , ప్రజాజ్యోతి** బార్ కౌన్సిల్లో నమోదైన న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులివ్వాలని ఐలూ రాష్ట్ర కమిటీ సభ్యులు టి.చైతన్య డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ, తెలంగాణ రాష్ట్ర కమిటీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను భద్రాచలం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్ట్ ఆవరణలో మంగళవారం న్యాయవాదులతో కలిసి ప్రదర్శించారు. ఈ ధర్నా కార్యక్రమానికి భద్రాచలం బార్ అసోసియేషన్ నుంచి న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా భద్రాచలం యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు బండారు అరుణ్ చంద్, పాయం రవివర్మ, జిల్లా కమిటీ సభ్యులు యు గౌతమ్ కుమార్, సీనియర్ న్యాయవాది యం కిషోర్, న్యాయవాదులు ఎ అంజిలి కుమారి, శివకృష్ణ, కోరాడ శ్రీనివాస రావు,విజ్జగిరి రవితేజ, సౌజన్య, పి మధు బాబు, లక్ష్మణ్ మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ కళాశాలల్లో మరమ్మత్తు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్






**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్16, (ప్రజా జ్యోతి)** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపడుతున్న మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్లు, ఇంజినీరింగ్ అధికారులతో కళాశాలల్లో కొనసాగుతున్న పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు రూ.3.31 కోట్ల వ్యయంతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపడుతున్న విద్యుదీకరణ, మరుగుదొడ్ల మరమ్మత్తులు, నూతన తరగతులు గదుల నిర్మాణం, భవనాల మరమ్మత్తులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిని కళాశాలల వారీగా సమీక్షించారు. పెండింగ్లో ఉన్న పనులను గుర్తించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యావాతావరణం కల్పించేందుకు కళాశాలల్లో అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మత్తు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సూచించారు.అనంతరం కళాశాలో విద్యార్థుల చేరికలు, ఇంటర్మీడియట్ ఫలితాలు, ఉత్తీర్ణత శాతంపై ప్రిన్సిపాల్లను అడిగి తెలుసుకున్నారు. ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అవకాశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ శాఖ ఈ ఈ శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంజన్నకు అభిషేకం....రామయ్యకు కల్యాణం



**భద్రాచలం టౌన్ , జూన్ 16 , ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం దాసాంజనేయస్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర బెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

# 12 ఏళ్ల చిన్నారిపై దారుణం చేసిన మృగానికి కఠిన శిక్ష విధించాలి




**కొత్తగూడెం, జూన్ 16 ( ప్రజాజ్యోతి )** ఖమ్మం పట్టణంలో 12 ఏళ్ల చిన్నారిపై జరిగిన దారుణ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. చిన్నారిపై అత్యాచారం చేసి, అనంతరం నాలుగంతస్తుల భవనం పై నుంచి కిందకు తోసివేసిన ఘటనను ఖండిస్తూ మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మహిళల భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చినా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారిపై అమానుషంగా ప్రవర్తించిన నిందితుడికి కఠిన శిక్ష విధించాలని కేసును ఫాస్ట్ట్రాక్ కోర్టులో విచారించి త్వరితగతిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు పూర్తి భద్రత కల్పించాలని కోరారు. ఈ ఘటనపై అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు స్పందించాలని మహిళా నాయకురాళ్లు విజ్ఞప్తి చేశారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న దారుణాల పట్ల సమాజం మౌనంగా ఉండకూడదన్నారు. ఖమ్మంలో రౌడీషీటర్గా పేరున్న నిందితుడికి ఎలాంటి రాజకీయ అండదండలు ఉన్నా చట్టం ముందు అందరూ సమానమేనని అతడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘోర నేరాలకు పాల్పడే వారిపై కఠిన శిక్షలు అమలు చేసినప్పుడే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అరికట్టగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, నాలుగో డివిజన్ కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి , బీజేపీ నాయకురాళ్లు సముద్రాల గాయత్రి, భూక్య స్వాతి, మువ్వ అపర్ణ, పద్మ, కుసుమ భవాని, డోలి కవిత, చంద్రకళ, కొల్లి అనిత తదితరులు పాల్గొన్నారు.

# హరిజన చెర్రి ప్రభుత్వ పాఠశాల భూమి ఆక్రమణ..!

- ప్రహరీ గోడ కూల్చి మరీ కబ్జా చేశారంటూ గ్రామస్తుల ఆరోపణలు





**టేకులపల్లి, జూన్ 17,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం రాంపురం పంచాయతీ పరిధిలోని హరిజన చెర్రి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల భూమి ఆక్రమణకు గురవుతుందనే ఆరోపణలు గ్రామంలో కలకలం రేపుతున్నాయి. భవిష్యత్ తరాలకు విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాల భూమిని కొందరు వ్యక్తులు తమదేనంటూ క్రమంగా ఆక్రమించుకుంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రహరీ గోడ కూల్చి భూమి దున్నేశారన్న ఆరోపణలు....** గ్రామస్తుల కథనం ప్రకారం పాఠశాల స్థాపన నుంచి దశాబ్దాలుగా విద్యా సేవలు అందిస్తున్న ఈ పాఠశాలకు సంబంధించిన భూమిలోకి కొందరు చొరబడి ప్రహరీ గోడను కూల్చివేసి ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం పాఠశాల భూమిలో కొంత భాగాన్ని దున్నేసి తమ సొంత భూమిగా పేర్కొంటూ వ్యవహరించారని తెలిపారు.

**అధికారుల దృష్టికి వెళ్లిన వివాదం....** పాఠశాల భూమి ఆక్రమణపై సమాచారం అందుకున్న మండల విద్యాధికారి (ఎంఈవో) జగన్ మంగళవారం స్థలాన్ని పరిశీలించి ప్రాథమిక విచారణ చేపట్టారు. పాఠశాల పక్కన ఉన్న భూమి యజమానులను పిలిపించి పూర్తి స్థాయి విచారణ నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

**పాఠశాల భూమిని పరిరక్షించాలని గ్రామస్తుల డిమాండ్....** విద్యాసంస్థల భూములు ఆక్రమణలకు గురికాకుండా రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని పాఠశాల భూమిని రక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. దశాబ్దాలుగా విద్యార్థులకు ఉపయోగపడుతున్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు.విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అధికారులు పేర్కొన్నారు.

**పరిశీలనలో స్థానిక ప్రజాప్రతినిధులు....** స్థల పరిశీలన సందర్భంగా రాంపురం పంచాయతీ సర్పంచ్ శివకృష్ణ,మాజీ ఎంపీటీసీ భూక్య సరోజిని,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**వయసు కేవలం 13 ఏళ్లు... చేతిలో పుస్తకం, మనసులో లక్ష్యం, అడుగడుగునా క్రమశిక్షణ. సాధారణ కుటుంబంలో జన్మించిన ఓ బాలుడు తన పట్టుదల, నిరంతర సాధనతో కరాటే రంగంలో విజయాల బాటలో దూసుకెళ్తున్నాడు. ప్రతి కిక్‌లో ఆత్మవిశ్వాసాన్ని, ప్రతి పోటీలో విజయసంకల్పాన్ని నింపుకుంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న భద్రాచలం పట్టణానికి చెందిన పిట్టల సిద్ధార్థ్ ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై భారత జెండాను రెపరెపలాడించాలనే మహత్తర లక్ష్యంతో ముందుకు సాగుతు న్నాడు. కరాటేలో ప్రతి కిక్ వెనుక కఠోర సాధన, ప్రతి పతకం వెనుక అచంచలమైన పట్టుదల ఉంటుందని నిరూపిస్తున్న ఈ బాల క్రీడాకారుడి ప్రస్థానంపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.**

# కిక్ కొడితే పతకమే..

- **కరాటేలో సత్తా చాటుతున్న భద్రాచలం బాలుడు**
- **అంతర్జాతీయ పోటీలే తదుపరి లక్ష్యం**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 16, ప్రజా జ్యోతి:** భద్రాచలం పట్టణానికి చెందిన పిట్టల సిద్ధార్థ్ ప్రస్తుతం సారపాకలోని భద్రాచలం పబ్లిక్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్నాడు. చదువులో రాణిస్తూనే కరాటే క్రీడలోనూ విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. చిన్న వయసులోనే క్రీడలపై ఆసక్తి పెంచుకున్న సిద్ధార్థ్, క్రమశిక్షణతో కూడిన సాధన ద్వారా వరుస విజయాలు సాధిస్తున్నాడు.

### ››› మాస్టర్ బత్తుల కిరణ్ శిక్షణలో మెరుగైన నైపుణ్యం

గత రెండేళ్లుగా సారపాక గ్రామానికి చెందిన కరాటే కోచ్ మాస్టర్ బత్తుల కిరణ్ ఆధ్వర్యంలో సిద్ధార్థ్ ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకునేలా కఠిన సాధన చేస్తున్నాడు. కోచ్ అందిస్తున్న మార్గదర్శకత్వం, శిక్షణతో కరాటేలో తన ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగుతున్నాడు.

### ››› రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాల పంట

సిద్ధార్థ్ ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని అనేక పతకాలు, ప్రశంసాపత్రాలు సొంతం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయి షోటోకాన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించగా, జాతీయ స్థాయి పోటీల్లోనూ తన ప్రతిభతో గుర్తింపు పొందాడు. గ్రీన్ బెల్ట్ హోదాను సాధించడం ద్వారా తన క్రీడా ప్రస్థానంలో మరో ముఖ్యమైన మైలురాయిని అధిగమించాడు. ప్రతి పోటీలోనూ మెరుగైన ప్రదర్శన కనబరుస్తూ భవిష్యత్తు ఆశాకిరణంగా నిలుస్తున్నాడు.

### ››› విజయాల వెనుక తండ్రి అండ

సిద్ధార్థ్ తండ్రి పిట్టల రవికుమార్ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కుమారుడిలోని ప్రతిభను గుర్తించి మొదటి నుంచి ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తున్నారు. క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే సిద్ధార్థ్ ఆశయానికి కుటుంబ సభ్యుల పూర్తి సహకారం లభిస్తోంది. తండ్రి ప్రోత్సాహమే తన విజయాలకు ప్రధాన కారణమని సిద్ధార్థ్ చెబుతున్నాడు.

### ››› అంతర్జాతీయ వేదికే తదుపరి లక్ష్యం

రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించిన సిద్ధార్థ్ ఇప్పుడు తన దృష్టిని అంతర్జాతీయ పోటీలపై కేంద్రీకరించాడు. భారతదేశం తరఫున ప్రపంచ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం తన కల అని చెబుతున్నాడు. దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలనే సంకల్పంతో ప్రతిరోజూ సాధన కొనసాగిస్తున్నాడు.

### ››› యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న సిద్ధార్థ్

సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఓ బాలుడు తన కృషి, పట్టుదలతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తి దాయకంగా మారింది. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి శ్రమిస్తే విజయం తప్పక దక్కుతుందని పిట్టల సిద్ధార్థ్ తన ప్రస్థానంతో నిరూపిస్తున్నాడు. భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికపై భారత జెండాను ఎగురవేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.






## ఇసుక లారీల రాకపోకలతో అంతరాయం

- **సోంపల్లి ర్యాంపు వద్ద లారీలను అడ్డుకున్న బూర్గంపహాడ్ వాసులు**



**బూర్గంపహాడ్, జూన్ 16 (ప్రజా జ్యోతి ):** ఇసుక లారీలు రయ్.. రయ్ మంటూ రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని బూర్గంపహాడ్ కి చెందిన రైతులు, ప్రజలు, స్థానికులు సోంపల్లి ర్యాంపు వద్ద లారీలను మంగళవారం అడ్డుకున్నారు. వ్యవసాయ సాగు సమయం కావడంతో రైతులు ట్రాక్టర్ల ద్వారా వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగుమందులు తమ పొలాలకు ఈ దారుల గుండానే వెళ్లాల్సి రావడంతో ఈ దారులను ఎంచుకున్న ఇసుక లారీలు ఇటుగా రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లన్నీ గుంతలు పడి అధ్వాన్నంగా మారాయని... తమ వ్యవసాయ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఇసుక ర్యాంపు నిర్వాహకులు దారి మార్చుకుని ఇసుక రవాణా సాగించాలని లేదంటే లారీలను ప్రతిసారీ అడ్డుకుంటామని హెచ్చరించారు. లారీలను అడ్డుకున్న వారిలో బూర్గంపహాడ్ కి చెందిన యువకులు, గ్రామస్థులు, రైతులు ఉన్నారు.

## మెచ్చా బర్త్ డే..

- **ఆలయంలో పూజలు, ఆసుపత్రిలో సేవా కార్యక్రమాలు**
- **కేసీఆర్ సీఎం కావాలని.. మెచ్చా ఎమ్మెల్యే కావాలని ప్రత్యేక ప్రార్థనలు**



**దమ్మపేట, జూన్.16 (ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను దమ్మపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ మర్రి భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మెచ్చా నాగేశ్వరరావు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. అలాగే బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని, మెచ్చా నాగేశ్వరరావు అశ్వారావుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నాయకులు కేక్ కట్ చేసి మెచ్చా నాగేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతున్న మెచ్చా నాగేశ్వరరావు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల సందర్భంగా దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మెచ్చా నాగేశ్వరరావుకు ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దొడ్డా రమేష్, పార్కలగండి సర్పంచ్ కొమరం సుశీల, మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసుబాబు, దారా యుగంధర్, జలగం వాసు, తుమ్మల లక్ష్మణ్‌రావు, సోయ్యం రాజబాబు, విష్ణు, నాయకపోడు సంఘం రాష్ట్ర నాయకులు రావుల శ్రీనివాసరావు, వార్డు సభ్యులు దారా రాము, ఉయ్యాల లక్ష్మీనారాయణ, రూపా రాంబాబు, బుడే, అబ్దుల్ జిన్నా, మాజీ నియోజకవర్గ యూత్ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, ఉద్యమ నాయకులు గాజుబోయిన శ్రీను, వల్లేపు నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకులు మద్దెల పుల్లారావు, కొలికపోగు ధర్మ, శ్రీరాముల చక్రధర్‌రావు, పాశ్యం ప్రసాద్, రెడ్డిమల్ల నాగయ్య, కోర్స వెంకటేశ్వరరావు, వెలుగోటి మహేష్, మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను, కాకా ప్రసాద్, పండు, గాజుబోయిన రాజేష్, కౌలూరి నాగయ్య, కార్తీక్, సాయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా జరగాలి: ప్రత్యేక అధికారి బి. నాగలక్ష్మి





**ములకలపల్లి, జూన్ 16 (ప్రజాజ్యోతి):** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించే సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈఓ), అశ్వారావుపేట నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీమతి బి. నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని మాదారం గ్రామ పంచాయతీలో ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి, ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుని ప్రస్తుతం గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన లబ్ధిదారుల సర్వేను పరిశీలించారు. సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పరిధిలో మురుగునీటి కాల్వల చివర నిర్మించిన ఇంకుడు గుంతల (సోక్ పిట్స్) పనులను తనిఖీ చేశారు. గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు మురుగునీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామారావు, మండల పంచాయతీ అధికారి రమేష్, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్ యూరియా యాప్ పై అవగాహన



**ఇల్లందు, జూన్ 16 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్స్ యూరియా యాప్ పై రైతులకు మంగళవారం మండల పరిధిలోని చల్లసముద్రం రైతు వేదికలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు అవగాహన కల్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా రైతులు తమ ప్రాంతాల్లో యూరియా లభ్యత, స్టాక్ వివరాలు తెలుసుకోవడంతో పాటు అవసరమైన ఎరువులను సులభంగా పొందవచ్చని కోరారు. రైతులు ఎరువుల కోసం అనవసరంగా తిరగాల్సిన అవసరం తగ్గి సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. యాప్ అమలు వల్ల ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరిగి బ్లాక్ మార్కెట్ విక్రయాలను అరికట్టడంలో కూడా సహాయపడుతుందని తెలిపారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందుబాటులో ఉండేలా ప్రణాళిక బద్ధంగా సరఫరా చేయడంలో ఈ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వినూత్న కార్యక్రమాన్ని అమలు చేసి రైతులకు సాంకేతిక సేవలను రాష్ట్ర ప్రభుత్వం చేరువ చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ లాల్ చంద్, ఏఓ సతీష్, ఏఈఓ సందీప్, ఫెర్టిలైజర్ డీలర్లు సోమ సుందర్, జనార్ధన్, గణేష్, రామలింగ చారి, బాలకృష్ణ, రైతులు మోకాళ్ళ సతీష్ కుమార్, పోటు రవి, లకావత్ గోప, రాంబాబు, ఎల్లంపల్లి బుచ్చయ్య, పత్తి ఉప్పలయ్య, రెడ్యా, గుగులోతు వీరన్న, ముక్తి సమ్మయ్య, అజ్మత్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యం.. కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం

- గ్రామ స్థాయి నాయకులతో ఎమ్మెల్యే జారె విస్తృత సమావేశం



**దమ్మపేట, జూన్. 16 (ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన బలమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. దమ్మపేట మండల కేంద్రంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మండల అధ్యక్షుడు కక్కిరాల రమేష్ ఆధ్వర్యంలో గ్రామ శాఖ అధ్యక్షులు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, మహిళా అధ్యక్షులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రతి కార్యకర్తకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించాలని కోరారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని జారె ఆదినారాయణ అన్నారు. పార్టీ బలోపేతం, నాయకుల మధ్య సమన్వయం, అభివృద్ధి పనుల అమలుకు కృషి చేస్తానని చెప్పారు. గ్రామ, మండల స్థాయిలో మరిన్ని కమిటీలను ఏర్పాటు చేసి కార్యకర్తలకు బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. అనంతరం మండల పరిధిలోని లబ్ధిదారులకు సుమారు రూ.4.33 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. దమ్మపేటలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. మండల నాయకులు చిన్నశెట్టి యుగంధర్, చీకటి శ్రీనివాసరావు, పోదిలి జ్యోతి, పగడాల రాంబాబు, కృష్ణారావు, కాకా రమేష్, చిన్నశెట్టి గోపి, దాశరోజు రాంబ్రహ్మం, రావు రఘు, దొడ్డ భాస్కరరావు, వనమాల శ్రీనివాసరావు, శంకరవరం అయ్యప్ప, కందుల వెంకటేశ్వరరావు, గట్ల సర్వేశ్వరరావు, నాగరాజు, చిలకా శ్రీను, దేవయ్య, కొయ్యల ప్రసాద్, పిట్టల శ్రీనివాసరావు, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, అన్నవరపు నాగేందర్‌రావు, తాళ్ల శంకర్, పగడాల గోపి, ఉలవల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమ సాగు

- తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు

**దమ్మపేట, జూన్. 16 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని గణేష్‌పాడు గ్రామ శివారులో ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించి సాగు చేసిన ఇద్దరు వ్యక్తులపై దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, గణేష్‌పాడు గ్రామ శివారులో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 4 ఎకరాల 4 కుంటల భూమిలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రామగోవిందాపురం గ్రామానికి చెందిన ఊకె రాములు, కణసాని జగ్గాచారిలు అక్రమంగా ప్రవేశించి వరి పంట సాగు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆ పంటను కోసుకున్నట్లు గుర్తించారు. ఈ విషయమై దమ్మపేట మండల తహసీల్దార్ రాంనరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉచిత నృత్య శిక్షణ అందించడం అభినందనీయం





**ఇల్లందు, జూన్ 16 (ప్రజా జ్యోతి)** వేసవి కాలంలో చిన్నారులకు ఉచిత నృత్య శిక్షణ అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు పట్టణంలోని బ్లూ మూన్స్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలు మంగళవారం కళాసి బస్తిలో గల ఆర్యవైశ్య సత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్లూ మూన్స్ డాన్స్ స్టూడియో నిర్వాహకులు చిన్నారులకు శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం సంతోషకరమన్నారు. డాన్స్ వల్ల చిన్నారులకు ఏకాగ్రత పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ మాట్లాడుతూ క్రీడ, సాంస్కృతిక శిబిరాల వల్ల చిన్నారులలో ఉన్న ఉత్సాహాన్ని మరింత పెంచుతుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నారులు వారి ప్రతిభను ప్రదర్శించాలన్నారు. అనంతరం సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ముద్రగడ వంశీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దొడ్డ డానియల్, జీవి భద్రం, విజయలక్ష్మి నగర్ పంచాయతీ సర్పంచ్ చందావత్ రమేష్ బాబు, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకుడు ఈసం నరసింహారావు, నిర్వాహకులు పొదిల శ్యామ్, రవితేజ, శశి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

- ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర అవగాహన సదస్సులో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న







**లక్ష్మీదేవిపల్లి, జూన్ 16 ( ప్రజాజ్యోతి )** ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఓటు హక్కు ఉన్నప్పుడే ప్రజాప్రతినిధులను, ప్రభుత్వాలను ప్రశ్నించే అధికారం లభిస్తుందని డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం పర్యటనలో భాగంగా సాటివారిగూడెం గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర అవగాహన) సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని ఓటు హక్కును కోల్పోతే చనిపోయిన వారితో సమానమవుతామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు వివరాలను పరిశీలించుకుని ఓటరు జాబితాలో పేరు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. మండల అధ్యక్షులు, గ్రామస్థాయి నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, బీఎల్ఏలు, కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, 2029 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరగట్ల ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ప్రసాద్ బాబు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంద హనుమంతు, జిల్లా కోశాధికారి కొదుమూరి శ్రీనివాసరావు, మండల నాయకులు పూనెం శ్రీను, గౌస్ పాషా సాటివారిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ వజ్జ విజయభాస్కర్, ఉప సర్పంచ్ ఉబ్బని రాజు, మాజీ సర్పంచ్ పడిగ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు కొంపల్లి వీరయ్య, కడియాల సత్యనారాయణ, దయ్యాల సమ్మయ్య, శ్రీను, బోయినపల్లి రాము, రావు కిరణ్, రావు మధు, బీఎల్ఏలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# వారికింత... వీరికింత....

# మాకుండేదేంతా...?

- పేటలో పెట్రేగిపోతున్న మట్టి మాఫియా
- అధికారుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు అందరికి అమ్యామ్యలేనా...?
- పేద, మధ్యతరగతి ప్రజల పై పెనుభారం పడుతుందా..?
- ఉదాసినాతే పుట్టిముంచునుందా..?
- అదుపుచేయకపోతే... అనర్ధమేనా...?

**"వారికింత... వీరికింత.... మాకుండేదేంతా...?" అంటూ అశ్వారావుపేట నియోజకవర్గంలో మట్టి మాఫియా బరితెగించి వ్యవహరిస్తోంది. నిబంధనలను తుంగలో తొక్కి, సహజ వనరులను నిలువునా దోచేస్తూ, అందరికీ వాటాలు పంచుతూ తమ అక్రమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తోంది. నిలదీయాల్సిన అధికారులు, ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులు సైతం ఈ 'మామూళ్ల' మత్తులో జోగుతుండటంతో నియోజకవర్గంలో మట్టి మాఫియా ఆగడాలు పరాకాష్టకు చేరాయని విస్తృత ప్రచారం జరుగుతుంది.**

**అశ్వారావుపేట, ప్రజాజ్యోతి**

### »» అందరికీ వాటాలు... 'అమ్యామ్యాల' పర్వమేనా..?

అశ్వారావుపేట పరిసర ప్రాంతాల్లో కొండలు, గుట్టలు, ప్రభుత్వ భూములే కాకుండా చెరువులను సైతం లక్ష్యంగా చేసుకొని మట్టి తోకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ అక్రమ దందా వెనుక పెద్ద నెట్‌వర్కే నడుస్తోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు, స్థానిక నాయకుల నుంచి కొందరు ప్రజాప్రతినిధుల వరకు అందరికీ 'అమ్యామ్యాలు' అందుతుండటంతో ఈ అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయిందని "ఎవరికి ఇవ్వాల్సిన వాటా వారికి ఇస్తున్నాం.. మమ్మల్ని అడిగేదెవరు?" అనే ధీమాతో మట్టి మాఫియా పెట్రేగిపోతున్నారంటున్నారు.

### »» పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం!

మట్టి మాఫియా సృష్టిస్తున్న తప్పుడు ప్రచారం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇళ్లు కట్టుకోవాలన్నా, చిన్నపాటి నిర్మాణ పనులు చేపట్టాలన్నా మట్టి ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ట్రాక్టర్ మట్టి కావాలన్నా వేలాది రూపాయలు గుంజుతుండటంతో పేద ప్రజలపై మోయలేని భారం పడుతోంది. ప్రభుత్వ సొత్తును ఉచితంగా దోచేస్తూ, సామాన్యుల దగ్గర మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### »» ఉదాసీనతే పుట్టి ముంచుతుందా..?

ఈ అక్రమ దందాపై స్థానికులు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా, పత్రికల్లో కథనాలు వచ్చినా సంబంధిత శాఖల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల ఈ ఉదాసీన వైఖరి చూస్తుంటే.. వీరు కూడా ఈ మాఫియాలో భాగస్వాములేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిఘా పెట్టాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలు కంటితుడుపు చర్యలతో సరిపెడుతున్నాయే తప్ప అక్రమాల్ని అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాయి. ఈ ఉదాసీనత ఇలాగే కొనసాగితే ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

### »» అదుపు చేయకపోతే అనర్థమే..?

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అశ్వారావుపేటలో సాగుతున్న మట్టి మాఫియా ఆటకట్టించకపోతే మున్ముందు భారీ అనర్థాలు తప్పవని మేధావులు, పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి, అవినీతి అధికారులపై, మాఫియా ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### »» ఎటువంటి అనుమతులు లేవు...కిషోర్..

### తహసీల్దార్.. అశ్వారావుపేట

స్థానిక అవసరాలకు మట్టితోలుకునే వారు మట్టి తోలేందుకు మైనింగ్ శాఖకు డిడి కట్టి మట్టి తోలుతున్నారు... తహసిల్దార్ కార్యాలయం నుండి ఎవరికి ఎటువంటి అనుమతులు ఇవ్వడం లేదు.. అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం

### »» నిబంధనలు పాటించాల్సిందే... శ్రీనివాసరావు... ఇరిగేషన్ ఏఈ

రైతులు తమ పొలలకు అవసరమైన మట్టిని తోలుకునేందుకు చెరువు నుండి నిబంధనలు మేరకు మాత్రమే మట్టిని తోలుకునేందుకు అనుమతులు ఇస్తున్నాం.. కమర్షియల్ గా మట్టి తోలేందుకు ఎటువంటి అనుమతులు లేవు ఎవరైనా హద్దు మీరితే చర్యలు తప్పవ్





## చిరు వ్యాపారులను తొలగించొద్దు

- ఎమ్మెల్యేకు సీఐటీయూ వినతిపత్రం



**దమ్మపేట, జూన్. 16 (ప్రజాజ్యోతి):** దమ్మపేట సెంటర్‌లో రహదారి ఇరువైపులా వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులను తొలగించకుండా వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు మంగళవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ దమ్మపేట సెంటర్‌లోని దుకాణదారులు డ్రైనేజీల పూడికతీత పనులను సొంత ఖర్చులతో కార్మికులను నియమించి నిర్వహిస్తూ గ్రామపంచాయతీకి సహకరిస్తున్నారని తెలిపారు. కొద్దిపాటి పెట్టుబడితో వ్యాపారాలు నిర్వహిస్తూ అనేక కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని పేర్కొన్నారు.అయితే ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేస్తున్న వారిని వేరే ప్రాంతానికి తరలిస్తామని, నాలుగు రోజుల వ్యవధిలో స్థలాలను ఖాళీ చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శి సూచించినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అక్కడే వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులను బలవంతంగా ఖాళీ చేయించడం సరికాదన్నారు. వారికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి, రఘు, పుల్లారావు, యుగంధర్, సుమన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు





**ములకలపల్లి, జూన్ 16(ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ములకలపల్లి మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు మాట్లాడుతూ, మెచ్చా నాగేశ్వరరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించి, కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసి మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పి, రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే పాలనను తీసుకురావాలని అన్నారు. మెచ్చా నాగేశ్వరరావు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాండ్ర రాంబాబు, బండి కొమరయ్య, పుష్పాల చంద్రరావు, శనగపాటి సీతారాములు, గంగవరపు సుధాకర్, దేవబత్తిని చిట్టిబాబు, సున్నం బాబురావు, కొండ్రు సుందర్‌రావు, సర్పంచ్ భూక్య ధర్మ, ముదిగొండ శ్రీను, గడ్డం ఉదయ్, తాటి రవి, తాటి ప్రవీణ్, సూరం పుల్లారావు, పూరేటి నరసింహారావు, కుదప శివయ్య, వేముల సతీష్, ఊరబెద్ది వెంకన్న, చిటికె లక్ష్మీకుమారి, కుంజా వెంకటేష్, కుంజా రాంబాబు, భూక్య ఆనంద్, బొర్రా సుధాకర్, కొండవీటి చంద్రశేఖర్, పుష్పాల సాయి, యలమంచిలి సునీల్, పుష్పాల హనుమంతు, సడియం అశోక్, ఊకే అశోక్, వాడే నరసింహారావు, సున్నం రాజు, పుష్పాల గోపి, పోడియం ప్రేమ్‌కుమార్, రింగు బాలకృష్ణ, బచ్చల సురేష్, మీడియా మహేష్, పత్తి భిక్షం, గందూరి ప్రమోద్, తాళ్ల శ్రీను, కాంపాటి సొందు తదితరులు పాల్గొన్నారు.